بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

Full Text of Friday Sermon Hazrat Khalifatul Masih V, 12 June 2026 (Telugu)

## హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గొప్ప ఆదర్శమైన దాతృత్వం, ఉదారత ఆధారంగా వారి సల్లల్లాహు అలైహి వసల్లం అద్భుత ప్రవర్తనల ఆసక్తికర ప్రస్తావన

హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 12.06.2026 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, (సర్రె) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ. أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ.
بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ○ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ○ اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ○ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ○ صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయం, అల్ బఖరహ్ అధ్యాయంలోని 275వ సూక్తి మరియు అజ్జారియాత్ అధ్యాయంలోని 20వ సూక్తి పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు.

నేను పఠించిన మొదటి సూక్తి అల్ బఖరహ్ అధ్యాయంలోనిది. దాని అనువాదం ఏమిటనగా: తమ సంపదను రాత్రి యందును, దినము యందును, రహస్యముగానో, బహిరంగముగానో (అల్లాహ్ మార్గము నందు) వినియోగిస్తున్న వారిని ప్రభువు బహుకరించును. అట్టి వారికి భయము వుండదు. దుఃఖమూ వుండదు.

రెండవ సూక్తి అజ్జారియాత్ అధ్యాయంలోనిది. అందులో అల్లాహ్ తఆలా ఇలా ఉపదేశిస్తున్నాడు: వారి ధనములలో అడుగువారి భాగము కూడ వుండెను. అడుగలేని వారి (భాగము) కూడ వుండెను.

ఈ రోజు నేను హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం దాతృత్వం మరియు ఉదారతకు సంబంధించిన కొన్ని హదీసులను వివరిస్తాను. ఈ హదీసుల ద్వారా స్వయంగా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆచరణ ఏమిటో మరియు వారు విశ్వాసులకు ఈ విషయమై పదేపదే ఏ విధంగా అవగాహన కల్పించారో తెలుస్తుంది.

హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం కూడా కేవలం తమ ప్రవచనాల ద్వారానే కాకుండా, తమ ఆచరణాత్మక ఉదాహరణ ద్వారా కూడా ఈ విషయమై ఎంతో శ్రద్ధ వహించారు.

హజ్రత్ అనస్ రజియల్లాహు అన్హు ఇట్లు ఉల్లేఖించారు: దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఈ ప్రార్థనా పదాలతో దుఆ చేసేవారు: అనగా ఓ అల్లాహ్! నేను పిసినారితనం నుండి, బద్ధకం నుండి, అత్యంత దయనీయమైన వృద్ధాప్యం నుండి, సమాధి శిక్ష నుండి, జీవితం, మరణాల పరీక్షల నుండి నీ శరణు వేడుకుంటున్నాను.

ఇదేవిధంగా హజ్రత్ అనస్ రజియల్లాహు అన్హు గారే ఇట్లు ఉల్లేఖించారు: దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఈ విధంగా దుఆ చేసేవారు:

اَللّٰهُمَّ إِنِّيْ أَعُوْذُ بِكَ مِنَ الْهَمِّ وَالْحَزَنِ، وَالْعَجْزِ وَالْكَسَلِ، وَالْجُبْنِ وَالْبُخْلِ، وَضَلَعِ الدَّيْنِ وَغَلَبَةِ

అనువాదం: ఓ అల్లాహ్! నేను చింత మరియు దుఃఖం నుండి, అసమర్థత మరియు బద్ధకం నుండి, పిరికితనం మరియు పిసినారితనం నుండి, అప్పుల భారం నుండి మరియు మనుషుల అణచివేత నుండి నీ శరణు వేడుకుంటున్నాను.

అల్లాహ్ తఆలా మార్గంలో ఖర్చు చేయడం గురించి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా హితబోధ చేశారు: నువ్వు (ధనమున్న) సంచి మూతిని ముడి వేసి ఉంచకు, లేదంటే నీకు కూడా ఇవ్వబడకుండా ఆపబడుతుంది.

వారు (స) ఇంకా ఇలా ఉపదేశించారు: (దానం చేసేటప్పుడు) లెక్కబెడుతూ ఉండకు, లేదంటే అల్లాహ్ తఆలా కూడా నీకు లెక్కగట్టి (పరిమితంగా) ఇస్తాడు.

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇంకా ఇలా ఉపదేశించారు: దాతృత్వం చూపేవాడు అల్లాహ్ తఆలాకు దగ్గరగా, స్వర్గానికి దగ్గరగా, ప్రజలకు దగ్గరగా మరియు నరకాగ్నికి దూరంగా ఉంటాడు. కానీ పిసినారి అల్లాహ్ తఆలాకు, స్వర్గానికి, ప్రజలకు దూరంగా మరియు నరకాగ్నికి దగ్గరగా ఉంటాడు. మోసగాడు, పిసినారి మరియు ఉపకారం చేసి అపనిందలు వేసేవాడు స్వర్గంలో ప్రవేశించలేరు. విశ్వాసి కపటం లేని సరళ స్వభావుడు మరియు దాతృత్వం కలవాడు, కానీ పాపాత్ముడు మోసగాడు మరియు నీచమైనవాడు.

మరొక సందర్భంలో హితబోధ చేస్తూ దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ప్రవచించారు: ఓ నాటి మానవుడా (ఆదమ్ కుమారుడా)! నీ అవసరానికి మించిన సంపదను ఖర్చు చేయడం నీకు శ్రేయస్కరం. దానిని నువ్వు దాచి ఉంచడం నీకు నష్టం కలిగిస్తుంది. అయితే అవసరానికి తగినంత దాచుకున్నందుకు నిన్ను నిందించడం జరగదు. ఎవరి పోషణ బాధ్యత నీపై ఉందో వారి నుండే (ఖర్చు చేయడం) ప్రారంభించు. పై చేయి (ఇచ్చే చేయి), కింది చేయి (తీసుకునే చేయి) కంటే ఉత్తమమైనది.

ఒకసారి హజ్రత్ బిలాల్ రజియల్లాహు అన్హు వద్దకు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం విచ్చేశారు. అప్పుడు వారి (రజి) వద్ద ఖర్జూరాల కుప్ప ఒకటి ఉంది. దానిని దైవ ప్రవక్త (స) కొరకు మరియు వారి అతిథుల కొరకు వారు (రజి) దాచి ఉంచారు. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ బిలాల్‌ను ఉద్దేశించి ఇలా అన్నారు: ఈ నిలవ ఉంచిన సంపద కారణంగా నరకాగ్ని వేడి నిన్ను చుట్టుముడుతుందేమోనని నువ్వు భయపడటం లేదా? ఆ తర్వాత దైవ ప్రవక్త (స) ఇలా ఉపదేశించారు: ఓ బిలాల్! ఖర్చు చేస్తూనే ఉండు. అర్ష్ (సింహాసనం) అధిపతి అయిన అల్లాహ్ తఆలా తోడుండగా దారిద్ర్యం, ఆకలి వస్తాయని భయపడకు.

మరొక సందర్భంలో దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ప్రవచించారు: నేను కేవలం పంపిణీ చేసేవాడిని మాత్రమే, ఇచ్చేవాడు మాత్రం అల్లాహ్ తఆలా ఒక్కడే.

దాతృత్వం మరియు ఉదారత అనే గుణాలు ప్రవక్త పదవి లభించక ముందే వారిలో ఉండేవి. దీనికి సాక్ష్యంగా మొదటి వహీ (దైవవాణి) అవతరించిన సందర్భంలో హజ్రత్ ఖదీజా రజియల్లాహు అన్హా పలికిన మాటలను మనం చదువుతూఉంటాము. ఆమె (రజి) ఇలా అన్నారు: మీరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అల్లాహ్ ప్రమాణంగా! అల్లాహ్ మిమ్మల్ని ఎన్నటికీ అవమానపర్చడు. ఎందుకంటే మీరు బంధుత్వాలను కలుపుతారు, అశక్తుల (అసహాయుల) భారాన్ని మోస్తారు, అంతరించి పోయిన సద్గుణాలను పునరుద్ధరిస్తూ పుణ్యకార్యాలు చేస్తారు, అతిథులను ఆదరిస్తారు మరియు నిజమైన ఆపదల్లో ప్రజలకు సహాయం అందిస్తారు.

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ఉపదేశించారు: రెండు అలవాట్లు ఒక విశ్వాసిలో ఉండవు. ఒకటి పిసినారితనం, రెండవది దుష్ప్రవర్తన. ఇంకా ఇలా వివరించారు: అన్యాయానికి దూరంగా ఉండండి....పిసినారితనం మరియు అత్యాశ నుండి మిమ్మల్ని మీరు రక్షించుకోండి. నిశ్చయంగా, పిసినారితనమే మీకు పూర్వం ఉన్నవారిని సర్వనాశనం చేసింది. ఒక దైవదాసుని హృదయంలోనూ

అత్యాశ పిసినారితనం మరియు దైవవిశ్వాసం కలిసి ఉండలేవు.

హజ్రత్ అనస్ రజియల్లాహు అన్హు ఇట్లు ఉల్లేఖించారు: దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మానవులందరిలో కెల్లా అత్యంత సుందరులు, ప్రజలందరిలో కెల్లా అత్యంత దాతృత్వశీలి మరియు ప్రజలందరిలో కెల్లా అత్యంత సాహసవంతులు (ధైర్యశాలి).

మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు ప్రవచించారు: అల్లాహ్ దాతృత్వం చూపే వారందరి కంటే అత్యంత మహా దాత, మరియు నేను మానవజాతిలో కెల్లా అత్యంత దాతృత్వశీలిని.

హదీసులలో ఇలా పేర్కొనబడింది: దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం రమజాన్ మాసంలో విపరీతంగా దాతృత్వం చూపేవారు. పుణ్యకార్యాలు మరియు మేలు చేయడంలో వారు వేగంగా వీచే సుడిగాలి కంటే కూడా అత్యంత వేగవంతులుగా మారిపోయేవారు.

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అనేవారు: ఒకవేళ నా వద్ద తిహామా పర్వతాలంత బంగారం ఉన్నా, నేను అదంతా మీలోనే పంపిణీ చేసేవాడిని. అప్పుడు మీరు నన్ను అబద్ధాలకోరుగాని లేదా పిసినారిగాని అని అనుకునేవారు కాదు. ఇంకా ఇలా ప్రవచించారు: నా వద్ద ఉహుద్ పర్వతమంత బంగారం ఉండి, మూడవ రాత్రి గడిచేసరికి అందులో నుండి ఒక్క దీనార్ కూడా నా వద్ద మిగిలి ఉండటాన్ని నేను ఇష్టపడను. కానీ నేను అప్పు తీర్చడం కొరకు దాచి ఉంచినది మినహా.

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ఉపదేశించారు: ఎవరైతే విపరీతమైన ఐశ్వర్యవంతులై ఉండి కూడా నిరుపేదల కొరకు ఖర్చు చేయరో, వారే ప్రళయ దినాన అత్యంత దరిద్రులుగా మిగిలిపోతారు.

ఒకసారి ఒక వ్యక్తి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారిని రెండు కొండల మధ్య ఉన్న మేకలన్నింటినీ (దానంగా) అడిగాడు. ప్రవక్త (స) అతనికి వాటన్నింటినీ ప్రసాదించారు. అతను తన జాతి ప్రజల వద్దకు వెళ్లి ఇలా అన్నాడు: ఓ నా జాతి ప్రజలారా! విశ్వాసం ప్రకటించండి (ఇస్లాంలోకి రండి)! అల్లాహ్ ప్రమాణంగా! హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఎంతగా ఇస్తారంటే, ఇక దారిద్ర్యం వస్తుందనే భయమే మిగలదు.

కొన్నిసార్లు ఎవరైనా కేవలం ప్రాపంచిక ప్రయోజనాల కోసమే ఇస్లాం స్వీకరించినప్పటికీ, ఆ తర్వాత వారికి ఇస్లాం ఈ లోకం మరియు లోకంలోని సమస్తం కంటే ఎక్కువగా అత్యంత ప్రియమైనదిగా మారిపోయేది.

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం రేపటి కోసం ఏ వస్తువునూ దాచి ఉంచే వారు కాదు. ఒకసారి దైవ ప్రవక్త గారు అస్ర్ నమాజ్ చేయించిన వెంటనే వేగంగా ఇంటికి వెళ్లారు, ఆ తర్వాత తిరిగి బయటకు వచ్చారు. దీని గురించి అడుగగా వారు (స) ఇలా బదులిచ్చారు: నేను సదకా (దానం)కు సంబంధించిన ఒక బంగారపు ముక్కను ఇంట్లోనే మరచివచ్చాను. అది రాత్రంతా నా వద్దే ఉండిపోవడాన్ని నేను ఇష్టపడలేదు, అందుకే (ఇప్పుడే) దానిని పంపిణీ చేసి వచ్చాను.

హజ్రత్ ఉమ్మె సల్మా రజియల్లాహు అన్హా ఇట్లు ఉల్లేఖించారు: ఒకసారి మహనీయ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారు నా వద్దకు విచ్చేశారు, అప్పుడు వారి ముఖం రంగు మారిపోయి (ఆందోళనగా) ఉంది. ఏదైనా బాధ లేదా నొప్పుల వల్ల అలా అయ్యి ఉంటుందని నేను భావించాను. నేను, ఓ దైవ ప్రవక్త! మీ ముఖం రంగు మారిపోయి ఉంది, ఏదైనా శారీరక బాధ వల్ల అలా జరిగిందా? అని మనవి చేశాను. దానికి మహా ప్రవక్త (స) ఇలా బదులిచ్చారు: లేదు! నిన్న సాయంత్రం మన వద్దకు వచ్చిన ఆ ఏడు దీనార్ల వల్ల ఇలా జరిగింది. రాత్రి గడిచిపోయింది కానీ మనం వాటిని ఖర్చు చేయలేదు. నేను వాటిని పరుపు మూలలో పెట్టి మరచిపోయాను, ఇప్పుడు అది గుర్తుకురావడంతో

నాకు తీవ్రమైన ఆవేదన కలిగింది.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా ప్రవచించారు: మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం స్థితి ఎలా ఉండేదంటే, వారి వద్ద ఏది ఉన్నా దానిని దానం చేసేవారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఎంతో లజ్జాశీలి (మర్యాదస్తులు). వారిని ఎవరైనా ఏదైనా అడిగితే, వారు తప్పకుండా దానిని ప్రసాదించేవారు. దానం చేసే విషయంలో వారు (స) ప్రజలందరి కంటే మహా గొప్ప దాత.

ఒకసారి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు డెబ్బై వేల దిర్హములు వచ్చాయి. ఆ ధనాన్ని ఒక చాపపై ఉంచారు. మహా ప్రవక్త (స) ఆ ధనాన్ని పంపిణీ చేయడానికి నిలబడ్డారు. సహాయం కోరి వచ్చిన యాచకులలో ఎవరినీ వారు ఖాళీ చేతులతో పంపలేదు, చివరికి ఆ ధనమంతటినీ పంపిణీ చేసి ముగించారు.

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారికి హజ్రత్ ఉస్మాన్ రజియల్లాహు అన్హు ఒక ద్రాక్ష గుత్తిని కానుకగా సమర్పించారు. మరొక నివేదికలో అది ఖర్జూరాల గుత్తి అని కూడా పేర్కొనబడింది. ఒకచోట ద్రాక్ష అని, మరొకచోట ఖర్జూరం అని ఉంది. ఏదేమైనప్పటికీ, ఆ తర్వాత ఒక యాచకుడు రాగా మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆ గుత్తిని అతనికి ఇచ్చి వేశారు. అది చూసి హజ్రత్ ఉస్మాన్ (రజి) ఆ యాచకుడి నుండి దానిని ఒక దిర్హమ్ ఇచ్చి కొనుగోలు చేశారు. తాను తెచ్చిన ఆ గుత్తి ఏదో ప్రత్యేకమైన రకానికి చెందినదై ఉండవచ్చు లేదా మంచి ఖర్జూరాలు అయి ఉండవచ్చు. హజ్రత్ ఉస్మాన్ (రజి) ఆ యాచకుడి నుండి దానిని ఒక దిర్హమ్‌కు కొని, తిరిగి మహా ప్రవక్త (స) గారి సేవలో సమర్పించారు. అంతలోనే ఆ యాచకుడు మళ్ళీ రాగా ప్రవక్త (స) ఆ గుత్తిని అతనికి తిరిగి ఇచ్చివేశారు. ఈ విధంగా ఈ ఉదంతం మూడు సార్లు జరిగింది. హజ్రత్ ఉస్మాన్ (రజి) దానిని కొనడం, దైవ ప్రవక్త గారికి సమర్పించడం, ఆ యాచకుడు మళ్ళీ వచ్చి అడగడం, ప్రవక్త (స) అతనికి ఇచ్చివేయడం జరిగింది. చివరికి మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఎంతో మృదువుగా ఆ యాచకునితో ఇలా అన్నారు: ఓ ఫలానా వ్యక్తి! నువ్వు యాచకుడివా లేక వ్యాపారివా? నువ్వు సహాయం కోరడానికి వచ్చావు, కానీ యాచకులు ఈ విధంగా చేయరు కదా! నువ్వు దిర్హములు సంపాదిస్తూ ఇక్కడ వ్యాపారం చేస్తున్నావు. ప్రవక్త (స) అతనికి ఇవ్వడానికి నిరాకరించలేదు, కానీ ఎంతో జ్ఞానయుక్తమైన శైలిలో, అతను చేస్తున్న ఈ పని మంచిది కాదని హితబోధ చేశారు.

హజ్రత్ అబ్దుల్లా బిన్ సలామ్ (రజి) ద్వారా ఉల్లేఖించబడిన హజ్రత్ జైద్ బిన్ సఅనా రజియల్లాహు అన్హు గారి ఇస్లాం స్వీకరణ ఉదంతాన్ని వివరించిన తర్వాత, సయ్యదినా హుజూరె అన్వర్ అయ్యద హుల్లాహు తఆలా బినస్రిహిల్ ఇలా సూచించారు: ఇదీ దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఉత్తమ నైతిక ప్రవర్తన. వారు (స) కేవలం అప్పు తీసుకొని ఒక జాతిని ఆకలి నుండి రక్షించడమే కాకుండా, తమ ఉత్తమ నైతికత ద్వారా ఒక పండితుడైన యూదుడు ఇస్లాం స్వీకరించుటకు కారకులయ్యారు.

---

اَلْحَمْدُ لِلّٰهِ نَحْمَدُهٗ وَنَسْتَعِيْنُهٗ وَنَسْتَغْفِرُهٗ وَنُؤْمِنُ بِهٖ وَنَتَوَكَّلُ عَلَيْهِ - وَنَعُوْذُ بِاللّٰهِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَيِّئَاتِ اَعْمَالِنَا - مَنْ يَّهْدِهِ اللّٰهُ فَلَا مُضِلَّ لَهٗ وَمَنْ يُّضْلِلْهُ فَلَا هَادِيَ لَهٗ - وَنَشْهَدُ اَنْ لَّآ اِلٰهَ اِلَّا اللّٰهُ وَنَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ - عِبَادَ اللّٰهِ رَحِمَكُمُ اللّٰهُ! اِنَّ اللّٰهَ يَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِيْتَآءِ ذِى الْقُرْبٰى وَيَنْهٰى عَنِ الْفَحْشَآءِ وَالْمُنْكَرِ وَالْبَغْيِ - يَعِظُكُمْ لَعَلَّكُمْ تَذَكَّرُوْنَ - اُذْكُرُوا اللّٰهَ يَذْكُرْكُمْ وَادْعُوْهُ يَسْتَجِبْ لَكُمْ وَلَذِكْرُ اللّٰهِ اَكْبَرُ -